

ఏయూ అచీవర్స్ డే రద్దు

» ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంగా ఎందుకు చెప్పలేదని ఏయూ అధికారులను ప్రశ్నించిన జేసీ

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు ఎన్నికల సమయంలో నిర్వహించ తలపెట్టిన 'అచీవర్స్ డే'కు జాయింట్ కలెక్టర్ అశోక్ అడ్డుకట్ట వేశారు. ఏయూలో పలువురు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు రాగా వారితో పాటు వారి తల్లిదండ్రులతో కలిపి మొత్తం 1,400 మందితో బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం 'అచీవర్స్ డే'ని భారీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సమయంలో ఇలా ఓటు హక్కు కలిగిన వారిని పెద్ద సంఖ్యలో సమావేశ పరిచి, ప్రభుత్వ అధికారులు ప్రసంగాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అయినా సరే ఏయూ పెద్దలు దీనికి నడుం కట్టారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా, తాము అన్ని అనుమతులు తీసుకున్నామని, ఎన్నికల అధికారులు కార్యక్రమం మొత్తం నిఘా కెమెరాలతో చిత్రీకరిస్తారని, తప్పుడు వార్తలు ప్రచురించారంటూ ఖండించారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమమే నిర్వహించాలని యత్నించి, ఎన్నికల సంఘం ఆదేశాలతో విరమించుకున్నారని, ఇక్కడ ఎందుకు ఇలా చేస్తున్నారంటూ 'ఆంధ్రజ్యోతి' గురువారం మరో కథనం ప్రచురించడంతో ... మిగతా 2వ పేజీలో

ఓపెన్ స్కూళ్ల ఫలితాలు విడుదల

టెన్త్‌లో 12.5%, ఇంటర్‌లో 22.88% ఉత్తీర్ణత

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూళ్ల (పదో తరగతి, ఇంటర్మీడియట్) ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. విశాఖ జిల్లా పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో 24, ఇంటర్మీడియట్‌లో చివరి స్థానం (26)లో నిలిచింది. పదో తరగతి పరీక్షలకు 920 మంది హాజరుకాగా 115 మంది (12.5 శాతం), ఇంటర్మీడియట్‌లో 1145 మందికి 262 (22.88 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్ష తప్పిన అభ్యర్థులకు జూన్ ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులు ఈనెల 29వ తేదీ నుంచి మే నాలుగో తేదీ వరకు ఫీజు చెల్లించాలని, అపరాధ రుసుంతో వచ్చేనెల పదో తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు.

నామినేషన్ల హోరు



ఉత్తర నియోజకవర్గానికి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వీవీ లక్ష్మీనారాయణ

» చివరిరోజు పార్లమెంటు స్థానానికి 12 మంది...

» అసెంబ్లీ సెగ్మెంట్లకు 68 మంది నామినేషన్

సెగ్మెంట్	నామినేషన్లు
భీమిలి	20
విశాఖ 'తూర్పు'	23
విశాఖ దక్షిణం	20
విశాఖ ఉత్తరం	25
విశాఖ పశ్చిమలో	18
గాజువాక	21
పెందుర్తి	20

» విశాఖ లోక్‌సభ స్థానానికి 39 మంది నామినేషన్లు

» అసెంబ్లీ సెగ్మెంట్లకు 147 మంది...

» నేడు పరిశీలన

» ఉపసంహరణకు 29 వరకూ గడువు

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో తొలి అంకం నామినేషన్ల దాఖలు కార్యక్రమం ముగిసింది. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ స్థానాలకు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయగా, చివరి రోజైన గురువారం జై భారత్ పార్టీ నుంచి సీబీఐ మాజీ అధికారి వీవీ లక్ష్మీ నారాయణ విశాఖ ఉత్తర సెగ్మెంట్‌కు నామినేషన్ వేశారు. కాగా, విశాఖ పార్ల మెంటుకు చివరిరోజు 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో మొత్తం 39 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టయ్యింది.

అసెంబ్లీ స్థానాలకు చివరిరోజు 68 మంది నామినేషన్లు దాఖలు చేయగా మొత్తం సంఖ్య 147కు చేరుకుంది. పార్లమెంటు స్థానానికి గురువారం దేవర శంకర్ (రాడికల్ పార్టీ), బిక్కవోలు చలమాజి (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), నక్కా నమ్మిగ్రేస్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ), అందుకూరి విజయ భాస్కర్ (ఇండియా ప్రజాబంధు పార్టీ)తోపాటు స్వతంత్ర్య అభ్యర్థులుగా పట్టపగలు రాజారమేష్, వియ్యపు గంగరాజు, మోహబూబ్ సుభాన్, కొల్లి నాగరాజు, లగుడు గోవిందరావు, వాసుపల్లి సురేష్, పొన్నాడ జనార్దన్, పిడిది అప్పారావు నామినేషన్లు వేశారు. నామినేషన్లను శుక్రవారం పరిశీలిస్తారు. ఈనెల 27వ తేదీ నుంచి 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.

ఏడు అసెంబ్లీ స్థానాలకు 147 మంది నామినేషన్

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం 68 మంది 75 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు భీమిలిలో ఆరుగురు ఆరు సెట్లు, విశాఖ తూర్పులో 12 మంది 13 సెట్లు, సౌత్‌లో 10 మంది 13 సెట్లు, ఉత్తరంలో 11 మంది 14 సెట్లు, విశాఖ పశ్చిమలో తొమ్మిది మంది 10 సెట్లు, గాజువాకలో 10 మంది 11 సెట్లు, పెందుర్తిలో ఆరుగురు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఒక అభ్యర్థి ఒకటి ఎక్కువగా వేసిన నామినేషన్లను మినహాయిస్తే ఏడు అసెంబ్లీ స్థానాలకు మొత్తం 147 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పరిశీలిస్తే భీమిలిలో 20, విశాఖ తూర్పులో 23, విశాఖ దక్షిణలో 20, విశాఖ ఉత్తరంలో 25, విశాఖ పశ్చిమలో 18, గాజువాకలో 21, పెందుర్తిలో 20 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 18వ తేదీన నామినేషన్లు దాఖలు ప్రారంభం కాగా చివరి రోజు ఎక్కువగా దాఖలయ్యాయి.

జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను చివరిరోజు గురువారం 68 మంది 75 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. భీమిలిలో కోలా హరిబాబు (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థిగా మేకా సత్యకిరణ్, జాతీయ జనసేన నుంచి గంటా శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు. విశాఖ తూర్పు నుంచి వై. వేణుగోపాల్‌కృష్ణ (భారతీయ చైతన్య యువజన పార్టీ), గుత్తుల శ్రీనివాసరావు, గుత్తుల మౌనిక (కాంగ్రెస్), కోనా శ్రీనివాసరావు (జైభారత్ నేషనల్ పార్టీ), తోట వెంకట సాయిముకుంద (ప్రజాప్రస్థానం), ఎ.దాలిరాజు (నవభారత్ నిర్మాణ సేవా పార్టీ), రజని ఈదుప్పగంటి (జాతీయ జనసేన), ఇండిపెండెంట్లుగా ఎస్.సుశీల, వాకుమల్లి గోవింద, వడ్డి శిరీష, ఈదుప్పగంటి సురేష్, ఉమ్మడి భాస్కరరావు నామినేషన్లు వేశారు. విశాఖ దక్షిణ నియోజక వర్గానికి వాసుపల్లి సంతోష్‌కుమార్ (కాంగ్రెస్), కె.శ్రీదేవి (జైమహా భారతీయపార్టీ), రావాడ తాతారావు ... మిగతా 2వ పేజీలో

మెయిన్స్‌లో మెరుపులు

విశాఖ విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో 8, 9, 69, 92, 93 ర్యాంకులు

» 500 లోపు 100 మందికి ర్యాంకులు

» కార్పొరేట్ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



చింటు సతీష్‌కుమార్ ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంకు



అనిల్‌రెడ్డి 9వ ర్యాంకు



మజ్జి రిషివర్ధన్ 69వ ర్యాంకు



డి.శ్రీనిధి, 261వ ర్యాంకు



యలమంచిలి హర్షవర్ధన్ 267వ ర్యాంకు



అల్లు హేమంత్ 277వ ర్యాంకు



బాలాదిత్య 295



డాకి మాధవరావు 373వ ర్యాంకు

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో విశాఖ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. ఈ ఏడాది రెండు పర్యాయాలు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలలో వచ్చిన మార్కుల సగటును అనుసరించి ర్యాంకులు విడుదల చేశారు. విశాఖ నగరంలో పలు కార్పొరేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 8, 9 ర్యాంకులు సాధించారు. చింతు సతీష్‌కుమార్ 8 (బీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 2), రెడ్డి అనిల్ 9, మజ్జి రిషీవర్ధన్ 69 (బీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 12), ఎం.మణికంఠ పృథ్వీరాజ్ 92, ఎం.సాయిశివలోచన్ 93వ ర్యాంకు తెచ్చుకున్నారు. ఇంకా డి.శ్రీనిధి 261, వై.హరవర్ధన్ 267, అల్లు హేమంత్ 277, ఎం.బాలాదిత్య 294, డి.మాధవరావు 373, కె.సంపత్ రాజీవ్ 439, కె.సాయిరాకేష్ 487, బి.సాహితీ 508, బి.తన్మయ్ 587, పి.సృజన్ నారాయణ 649, ఎ.రామలింగంనాయుడు 657, ఎ.సాత్విక్ 799, ఎస్.తనూజ్ 815, ఎం.భానుప్రకాష్ 820, ఇ.స్నుజన 890 ర్యాంకు ... మిగతా 2వ పేజీలో

అడుగంటుతున్న భూగర్భ జలాలు

ఎండాడ, రుషికొండ, మధురవాడ, ఆరిలోవ ప్రాంతాల్లో ఆందోళనకరం



» 17 నుంచి 19.71 మీటర్ల లోతులో జలాలు

» గాజువాక, సీతమ్మధారల్లోనూ ప్రమాద ఘంటికలు

» గ్రామీణ ప్రాంతాల్లోనూ తగ్గిన నీటి మట్టాలు

» వర్షాభావమే కారణం

» మరోవైపు విచ్చలవిడిగా నీటి వినియోగం

» పొదుపుగా వాడుకోవాలని సూచనలు

» ప్రతి ఇలు/అపార్టుమెంటు ఆవరణలో ఇంకుడుగుంత ఏర్పాటుచేసుకోవాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గత ఏడాది నైరుతి సీజన్, అలాగే ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కూడా వర్షాలు తక్కువగా కురిశాయి. ఆ ప్రభావం భూగర్భ జలాలపై పడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా సగటు 6.61 మీటర్లు కాగా మార్చి నాటికి 9.06 మీటర్లకు పడిపోయింది. ఈ నెల (ఏప్రిల్)లో నీటి మట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉంది.

తీవ్ర ఒత్తిడిలో ఎండాడ ప్రాంతం

నగర జనాభా 25 లక్షలు దాటింది. జనాభాకు తగినంత నీటిని జీవీఎంసీ సరఫరా చేయలేకపోతోంది. ఈ నేపథ్యంలో రోజువారీ అవసరాలకు సామాన్య ప్రజలు, వాణిజ్య కార్యకలాపాలకు వ్యాపారులు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. దీనికితోడు నగర శివారులో ఎండాడ, రుషికొండ, మధురవాడ, కొమ్మాది, పీఎం పాలెం ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు రావడంతో వందల మీటర్ల లోతుకు బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. నీటి వినియోగంపై నియంత్రణ లేకపోవడం, వాడిన నీటిని తిరిగి ఇతర అవసరాలకు వినియోగించకపోవడం వంటి కారణాలతో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. కంబాలకొండ పరిసరాల్లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా భూగర్భ జల నిపుణులు పేర్కొంటున్నారు.

ఎండాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో మార్చి నెల నాటికి భూగర్భ జలాలు 19.71 మీటర్ల లోతున ఉన్నాయి. ఈ ప్రాంతంలో వందలాది బోర్లు నిరంతరం పనిచేస్తుంటాయి. అలాగే పెదరుషికొండ ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో గత ఏడాది ఫిబ్రవరిలో 15.63 మీటర్లు ఉండగా... ఈ ఏడాది ఫిబ్రవరిలో 16.18 మీటర్ల మేర ఉన్నాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో గత ఏడాది ఫిబ్రవరిలో 12.9 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 14.79 మీటర్లు, మధురవాడలో గత ఏడాది 5.92 మీటర్లు ఉండగా, ఈ ఏడాది 14.52 మీటర్ల లోతులో ఉన్నాయి. మధురవాడ ప్రాంతంలో చెరువులు, గెడ్డలు కబ్జా లేదా పూడ్చేయడంతో వర్షపు నీరు ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. ఇక నగరంలో సీతమ్మధార, మహారాణిపేట, దసపల్లా హిల్స్, సీబీఎం కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

పది మీటర్ల కంటే ఎక్కువ లోతు ఉన్న ప్రాంతాలు

జిల్లాలో 31 ప్రాంతాల్లో ప్యూజో మీటర్లు ఉండగా మార్చి నెల నాటికి 12 చోట్ల 10 మీటర్లు, అంతకంటే ఎక్కువ లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఎండాడలో 19.71 మీటర్లు, పెదరుషికొండలో 19.24, మధురవాడలో 18.37, ఆరిలోవలో 17.66 మీటర్లు, సెంట్రల్ పార్కు వద్ద 15.43, గాజువాకలో 12.58, సీతమ్మధారలో 12.17, పెందుర్తిలో 12.14, మారికవలసలో 11.46, పందులపాక (ఆనందపురం మండలం)లో 11.25, వెల్లంకిలో 10.72, అన్నవరం (పద్మనాభం)లో ... మిగతా 2వ పేజీలో

పేదోడి పొట్టకొట్టిన వైసీపీ



టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్ (ఫైల్ ఫొటో)

తెలుగుదేశం హయాంలో పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం



అన్న క్యాంటీన్‌లో మూలనపడ్డ సామగ్రి

» జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల ఏర్పాటు

» రూ.5కే అల్పాహారం

» మధ్యాహ్నం/రాత్రి భోజనం రూ.5కే

» నాణ్యమైన ఆహారం అందించడంతో క్యాంటీన్లకు విశేష ఆదరణ

» వైసీపీ అధికారంలోకి రాగానే క్యాంటీన్ల మూసివేత

» పేదలు, కూలీల్లో ఆగ్రహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) నిరుపేదల కడుపు నింపేందుకు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కక్ష గట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసివేయించింది. రూ.5కు అన్నం పెట్టిన క్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేయించడం దారుణమంటూ వైసీపీ ప్రభుత్వంపై పేదలు, కూలీలు ఆగ్రహంతో ఉన్నారు.

పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలు, భవన నిర్మాణ కూలీలు, తదితరులకు కేవలం రూ.5కు నాణ్యమైన ... మిగతా 2వ పేజీలో

జీవీఎంసీ పరిధిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు	25
ఉదయం టిఫిన్	రూ.5
మధ్యాహ్నం భోజనం	రూ.5
రాత్రి భోజనం	రూ.5
ప్రతీరోజూ అల్పాహారం చేసినవారి సంఖ్య	10 వేలు
ప్రతీరోజూ మధ్యాహ్నం భోజనం చేసినవారి సంఖ్య	15వేల మంది
ప్రతీరోజూ రాత్రి భోజనం చేసేవారి సంఖ్య	10వేలు


అన్ని హోర్డింగులూ వైసీపీకేనా?

బస్టాప్‌లలో కొనసాగుతున్న 'నవరత్నాల' ప్రచారం

ఎన్నికల సంఘం గుర్తించదా..?



స్వర్ణభారతి స్టేడియం జంక్షన్ వద్ద సిద్ధం ఫ్లెక్సీలు



గురుద్వారా బస్టాప్ వద్ద నవరత్నాలు ప్రచారం

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల సంఘం సరిగ్గా పనిచేస్తున్నదా? లేదా? అని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. నగరంలో జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారుల్లో హోర్డింగులపై ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' పోస్టర్లే కనిపిస్తున్నాయి. ప్రైవేటు స్థలాలైనా, ప్రభుత్వ స్థలాలైనా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుంటే...వాటిని సమానంగా అన్ని పార్టీలకు కేటాయించాలని ఎన్నికల సంఘం ఓ నిబంధన పెట్టింది. జిల్లా ఎన్నికల అధికారి కూడా ఈ విషయం అనేకసార్లు స్పష్టంచేశారు. కానీ విశాఖపట్నంలో ఆ పరిస్థితి లేదు. నగరంలోని హోర్డింగులపై అత్యధిక శాతం వైసీపీ ప్రచారమే కనిపిస్తోంది. మిగిలిన వాటిలో వాణిజ్య ప్రకటనలు ఉంటున్నాయి. ఇతర పార్టీలకు ప్రచారానికి అవకాశమే ఇవ్వడం లేదు. దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?...అని ఇతర పార్టీల అభిమానులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. అలాగే జాతీయ రహదారిపై గల అనేక బస్టాప్‌లలో సైతం నవరత్నాల ప్రచారం (గ్లోసైన్ బోర్డులు) కొనసాగుతోంది. ఎన్నికల పర్యవేక్షణ అధికారులు మరి ఏం చేస్తున్నారో?


46వ వార్డులో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న శ్యామల దీపిక

వైసీపీకి ఓటు వేస్తే.. పిల్లలకు భవిష్యత్తు ఉండదు

» ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు » 46వ వార్డు పరిధిలో విస్తృత ప్రచారం » 45వ వార్డులో తండ్రి తరపున కుమార్తె ప్రచారం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: వైసీపీకి ఓట్లువేస్తే మీ పిల్లల భవిష్యత్తుకు ఉరితాడు వేసినట్లేనని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణు కుమార్ రాజు హెచ్చరించారు. గ్రేటర్ 46వ వార్డులో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనారాయణపురం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు వెళ్లి కళాయిలో చిప్స్ వేయించి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేస్తే మన మనుగడ మరింత ప్రమాదంలోపడుందని అన్నారు. ఇటువంటి దుర్మార్గంగా పాలన గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారన్నారు. ఈ స్థితిలో ఆపార్టీకి ఓటు వేసి గెలిపిస్తే భవిష్యత్తు ఉండదని, ఈ స్థితిలో ఈ అరాచక పాలనకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సంక్షేమ పాలన అందించడానికి వీలవుతుందన్నారు. ఉత్తర ని యోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గుర్తు కమ లంపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏపీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనుందో వివరిచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్నికల పరిశీలకుడు మహ్మద్ నజీర్, టీడీపీ, బీజేపీల వార్డు అధ్యక్షులు పుక్కళ్ళ పైడికొండ, గార ఈశ్వరరావు, నాయకులు ఆవాల నారాయణస్వామి, యాగాటి ఆదిలక్ష్మి, తోట శ్రీదేవి, కొప్పిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

45వ వార్డులో బీజేపీ ఇంటింటి ప్రచారం

ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు గెలిపించేందుకు కమలం గుర్తుపై ఓటు వేయాలని ఆయన కుమార్తె శ్యామల దీపిక అభ్యర్థించారు. ఈ మేరకు గ్రేటర్ 45వ వార్డు ఏఎస్‌ఆర్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి గురువారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఆమె మహిళలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఓచోట ఇ స్త్రీ చేసి ఆమె ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


డెంకాడవీధిలో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్


ప్రేమసమాజం ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న పద్మజ

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

» ఎన్నికల ప్రచారంలో దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ » నిరాజనం పలికిన జనం

మహారాణిపేట, ఏప్రిల్ 25: బలహీన వర్గాల అభివృద్ధే తన ధ్యేయమని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం 37వ వార్డు రెల్లివీధి అంబేద్కర్ విగ్రహం నుంచి ఆయన తన ప్రచారం ప్రారంభించారు. డెంకాడవీధి, పెయిందొరపేట, జాలారిపేటపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి తనను ఎమ్మెల్యేగా, ఎంపీ ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు విన్నారు. నిరుపేదల సంక్షేమమే తన సంకల్పమని భరోసా ఇచ్చారు. ఇళ్ల మంజూరు చేస్తానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. మీ ఆశీర్వాదం కావాలని అభ్యర్థి ంచారు ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్య కర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏవీఎన్ కాలేజీ డౌన్ సున్నపువీధిలోని బాపన ముత్యాలమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. అన్నదానం అన్నింటిలోకి ఉత్తమమైందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. అనంతరం భక్తులకు స్వయంగా ఆయన భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుఖ శాం తులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, గ్రామకమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సేవల్లోనే సంతృప్తి.. వంశీకృష్ణ సతీమణి పద్మజ

డాబాగార్డెన్స్: ప్రేమ సమాజంలో అనాథ బాలికలు, వృద్ధులకు , మహిళలకు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ సతీమణి పద్మజ అన్నారు. గురువారం ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్నం వడ్డించారు. ఆశ్రమం పొందుతున్నవారి పరిస్థితి చూసి ఆమె చలించిపోయారు. ప్రేమ సమాజంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ముత్యమాంబ


శాకంబరిగా అమ్మవారు

కంచరపాలెం, ఏప్రిల్ 25 : కంచరపాలెం మెట్టు వద్ద కొలువై ఉన్న ముత్యమాంబ మారువారం పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. మారు పండగ నేపథ్యంలో అమ్మవారిని తాజా కూరగాయలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులుచెల్లించుకున్నారు. సాయంత్రం ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నీలి మేఘం..గాలి కెరటం

» ఆకాశం మేఘావృతంతో ఉపశమనం


మాధవధారం ప్రాంతంలో సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

మురళీనగర్, ఏప్రిల్ 25 ; గత కొద్ది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న నగర వాసులకు ఊరట లభిస్తోంది. రెండురోజులుగా సాయంత్రం 3 గంటలు దాటిన తర్వాత వాతావరణం మేఘావృత్తం కావడంతో ఎండ ప్రభావం తగ్గుతోంది. చల్లని గాలులతో జనాలు సేదతీరున్నారు. వాతావరణ శాఖ గత రెండు రోజులుగా ఎండలతోపాటు వడగాల్పులు వీస్తాయన్న హెచ్చరికలతో ఆందోళన చెందిన జనానికి గురువారం సాయంత్రం ఊరట నిచ్చింది. ఆకాశం మబ్బులేసి చల్లని గాలులు వీయడంతో నగర వాసులకు ఉపశమనం లభించినట్లయింది.

వీవీ లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు


ఆర్వోకి నామినేషన్ పత్రాలు అందిస్తున్న లక్ష్మీనారాయణ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ గురువారం నామినేషన్ చేశారు. అభిమానులు, కార్యకర్తలో ర్యాలీగా వెళ్లి సీతమ్మధార కార్యాలయంలో అధికారులకు నామి నేషన్ పత్రాలు అందించారు. అనంతరం బ యటకు వచ్చి మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌విషయంలో హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిందని, 2024 జూన్‌లో కోర్టు తిరిగి తెరిచేవరకు స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించడం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపినట్టు ఈ సందర్భంగా చెప్పారు. యథాతథ స్థితిని పాటించాలని యూనియన్ ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశిస్తూ హైకోర్టు జూన్ 19వ తేదీకి వాయిదా వేసిందన్నారు. విశాఖస్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా పలు ఆధారాలతో ఇప్పటికే హైకోర్టులో లక్ష్మీనారాయణ పిల్ వేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు స్టేటస్ కో లక్ష్మీనారాయణ రాజకీయ తొలి విజయంగా అభిమానులు భావిస్తున్నారు. ఆయన వేసిన పిల్‌పై న్యాయవాది యలమంజుల బాలాజీ వాదించారు.

వాల్తేరు రైల్వే నూతన సీనియర్ డీసీఎంగా సందీప్


డీసీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందీప్

విశాఖపట్నం, ఏప్రిల్ 25: తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ నూతన సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా (సీనియర్ డీసీఎం) కే సందీప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ సివిల్ సర్వీసెస్ 2013 బ్యాచ్‌కు చెందిన సందీప్.. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ (ఐఆర్‌టీఎస్) అధికారిగా కుర్దా డివిజన్‌లో అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించి వాల్తేరు డివిజన్‌లో ఏరియా మేనేజర్‌గా, సంబల్‌పూర్ డివిజన్‌లో డీపీవోగా, సీనియర్ డీపీవో (మూమెంట్)గా పనిచేశారు. కుర్దా డివిజన్‌లో సీనియర్ డీపీవోగా పనిచేస్తూ వాల్తేరు డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సీనియర్ డీసీఎంగా పనిచేసిన ఏకే త్రిపాఠి సంబల్‌పూర్ డివిజన్‌కు సీనియర్ డీపీవోగా బదిలీ అయ్యారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 : ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్కరాజు రామారావు గురువారం నామినేషన్ వేశారు. మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌లతో ర్యాలీగా బయలుదేరి తాటిచెట్లపాలెం, గురుద్వార మీదుగా సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందన్నారు.

అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

» ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని


33వ వార్డులో ప్రచారం చేస్తున్న తేజస్విని

అల్లిపురం, ఏప్రిల్ 25: అభివృద్ధికి అవకాశం కల్పించే అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సతీమణి తేజస్విని అన్నారు. గురువారం సాయంత్రం 33వ వార్డులో ప్రచారం చేశారు. ముందుగా నీలమ్మఅమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వార్డులో ఇంటింటికి వెళ్లి అప్యాయంగా పలకరిస్తూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించి వైసీపీ పాలనతో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని నిలువరించాలని కోరారు. ఎంపీగా శ్రీభరత్‌ను, అసెంబ్లీ అభ్యర్థి వంశీ కృష్ణలను అఖండ మెజారిటీతో గెలిపించాలని మహిళలకు కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి,గోపీ కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, తిరుమలాదేవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఫిట్జీ విద్యార్థులకు ర్యాంకులు


విద్యార్థులతో అధ్యాపక బృందం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఫిట్జీ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ కళాశాల విద్యార్థులు వరుసగా ఏఐఆర్ 3, 13, 23, 35, 42, 48, 50లను సాధించారు. ఫిట్జీ వైజాగ్ విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీరామ వెంకటకృష్ణ, 1149వ ర్యాంక్, ఎల్. సాయి వెంకట కార్తీక్ 1203వ ర్యాంక్, హంసిని 1609వ ర్యాంక్, డి. వెంకట అరవింద్ 4010, కృష్ణగార్గి 4621వ ర్యాంక్, ఎన్.సాయిసాత్విక్ 4788వ ర్యాంక్‌ను పొందారు.మొత్తం 680 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రాయగా 263 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. ఈ సందర్భంగా మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్‌రావు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

శ్రీవిశ్వ జూనియర్ విద్యార్థులు విజయకేతనం


ఫలితాలను సాధించిన శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ -2024 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్టు చైర్మన్ కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విశాఖపట్నం విద్యా సంస్థ శ్రీవిశ్వ విద్యార్థులు పప్పు గౌతమ్ 468వ ర్యాంకు , పి. ఓంకార్ సాయిరాయుడు 522వ ర్యాంకు, జాగరపు శ్రావ్య 620వ ర్యాంకు, పి.వెంకటసాయిరామ్‌దత్త 645వ ర్యాంకు, పొట్నూరు ఆదిత్య 674వ ర్యాంకు కె.జయవర్ధన్ 725, జె.శ్రావ్యశ్రీ 768, కర్రి మహేష్ 943 సాధించినట్టు వివరించారు. సాధారణ విద్యార్థులతో తమ కళాశాల అసాధారణ ఫలితాలను సాధించిందన్నారు. వెయ్యిలోపు 8 మంది, 5 వేల లోపు ర్యాంకులు 30 మందికి, పది వేలలోపు 52 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. దాదాపు 16 మంది విద్యార్థులు 99 పర్సంటైల్‌పైగా సాధించారన్నారు. 216 మందికిపైగా విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీలలోసీటు పొందేలా ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని వారు అభినందించారు.

ఏయూ అచీవర్స్ డే రద్దు

... 1వ పేజీ తరువాయి

జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ స్పందించారు. తనకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత విషయం ఎందుకు చెప్పలేదని ఏయూ అధికారులను ప్రశ్నించారు.సాధారణ సమావేశం అని చెప్పడం వల్లే అనుమతి ఇచ్చామని, తప్పుడు సమాచారం ఇచ్చినందున అనుమతి రద్దు చేయాలని సంబంధిత ప్రాంతపు ఎన్నికల అధికారిని ఆదేశించారు. దాంతో శుక్రవారం నిర్వహించాల్సిన అచీవర్స్ డే రద్దయింది.

మెయిన్స్‌లో మెరుపులు

... 1వ పేజీ తరువాయి

సాధించారు. కాగా నగరంలో కార్పొరేట్ కళాశాలలైన శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, అసెంట్, శ్రీవిశ్వ, తదితర సంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. 500లోపు 100 మంది, 1000లోపు 200 మంది ర్యాంకులు తెచ్చుకున్నట్టు కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఉంది

-చింటు సతీష్‌కుమార్, 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ)


CHINTU SATISH KUMAR

నగరంలోని నారాయణ కళాశాలలో చదువుతున్న చింటు సతీష్‌కుమార్ మెయిన్స్‌లో 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ) సాధించాడు. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతీష్‌కుమార్ తల్లిదండ్రులు రమాదేవి, బుచ్చన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సహకారంతో ఈ ర్యాంకు సాధించగలిగానంటున్న సతీష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరాలనుకుంటున్నట్టు చెప్పాడు. తదుపరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలనుకుంటున్నట్టు తెలిపాడు.

పేదోడి పొట్టకొట్టిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

ఆహారాన్ని అందించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం 2018 జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. అన్న క్యాంటీన్‌లకు ఆహారాన్ని సరఫరా చేసే బాధ్యతను అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించింది. అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజూ ఉదయం ఏదో ఒక అల్పాహారాన్ని రూ.ఐదుకే అందజేసేవారు. అలాగే మధ్యాహ్నం, రాత్రి పూట కూడా నాణ్యమైన భోజనాన్ని రూ.5కే పెట్టేవారు. అనతికాలంలోనే అన్న క్యాంటీన్లకు విశేషమైన ఆదరణ రావడంతో దశల వారీగా జీవీఎంసీ పరిధిలో విమ్స్ ఎదురుగా, ఎంవీపీ రైతుబజార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, టర్నర్ చౌల్ట్రీ, హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్, మద్రిపాలెం, శ్రీహరిపురం, ములగాడ పంప్‌హౌస్, చినగంట్యాడ, చిట్టివలస, రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్ ఓపీ గేట్, ఆరిలోవ, మారికవలస, వాంబే కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి, తదితర 25 చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేశారు. వీటన్నింటికీ పక్కా భవనాలు కట్టించి భోజనం చేసేవారికి సౌకర్యంగా ఉండేందుకు కుర్చీలు, టేబుళ్ల వంటి సదుపాయాలు కల్పించారు. భవన నిర్మాణ కూలీలు, రిక్షావాలాలు, ఆటోడ్రైవర్లు, నిరుపేదలు, ఉద్యోగ శిక్షణ కోసం నగరంలో ఉండే పేద విద్యార్థులు క్యాంటీన్లలో ఆకలి తీర్చుకునేవారు. నగర పరిధిలో ప్రతిరోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది మధ్యాహ్నం భోజనం, పది వేల మంది రాత్రి భోజనం చేసేవారు. కూలీలు, చిరుద్యోగులు, అల్పాదాయ వర్గాలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం సమకూరడంతో ఖర్చులు తగ్గి ఆర్థికంగా కొంత వెసులుబాటు కలిగేది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను మూసివేయించింది. అన్నక్యాంటీన్ల పేరు మార్చాలని మొదట్లో వైసీపీ నేతలు భావించినా, వాటిపై టీడీపీ ముద్ర తొలగిపోదనే ఉద్దేశంతో శాశ్వతంగా మూసివేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అన్న క్యాంటీన్లకు ప్రత్యామ్నాయంగా అంతకంటే మెరుగ్గా ఉండేలా 'ఆహా క్యాంటీన్ల'ను ఏర్పాటుచేస్తామని వైసీపీ నేతలు ప్రకటించినా, ఐదేళ్లయినా కార్యరూపం దాల్చలేదు. అయితే తమకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించిన అన్న క్యాంటీన్లను రద్దు చేసి తమ కడుపు కొట్టారంటూ వైసీపీ ప్రభుత్వాన్ని నిరుపేదలు ఇప్పటికీ తూర్పారబడుతుంటారు.

సమయానికి నాణ్యమైన ఆహారం తినేవాళ్లం

-కందివలస కృష్ణ, అక్కయ్యపాలెం

అన్న క్యాంటీన్ మా ఇంటికి దగ్గర్లోనే సోనియానగర్ వద్ద ఉండేది. మూడు పూటలా నాణ్యమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచేవారు. రూ.ఐదుకే అల్పాహారం తిని పనికి వెళ్లిపోతే, రాత్రికి రూ.5కే మళ్లీ అక్కడే భోజనం తిని ఇంటికి వెళ్లిపోయేవాడిని. మా ఇంట్లో ఉన్నవారు కూడా అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేసేవారు. ఆరోగ్యం కూడా బాగుండేది. అన్న క్యాంటీన్‌లను మూసివేయడంతో అర్ధాకలితో జీవనంసాగిస్తున్నాం. ఉదయం టిఫిన్ చేయాలంటేనే రూ.50 వెచ్చించాల్సివస్తోంది. మళ్లీ అన్న క్యాంటీన్‌లను అందుబాటులోకి తేవాలి.

రాజకీయాల కోసం పేదల కడుపు కొట్టారు

- వై.చిట్టిబాబు, రామకృష్ణానగర్

రాజకీయాల కోసం అన్న క్యాంటీన్‌లను మూసి వేయించి మాలాంటి పేదల కడుపు కొట్టారు. టీడీపీ హయాంలో ఏర్పాటుచేశారనే అక్కసుతోనే వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను మూసివేయించేశారు. అన్న క్యాంటీన్‌లు ఏర్పాటుచేసిన తర్వాత నామమాత్రపు ధరతో మూడు పూటలా నాణ్యమైన ఆహారం తినగలిగాం. దీనివల్ల ఆర్థికంగా కూడా మాకు భారం తగ్గింది. అన్న క్యాంటీన్‌లు రద్దు చేయడంతో వచ్చిన కూలీ డబ్బుల్లో సగం డబ్బుని ఆహారానికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఎసెంట్ కళాశాల విద్యార్థికి 223వ ర్యాంకు


జేఈఈలో ర్యాంక్ సాధించిన హరీష్‌కుమార్

సీతంపేట, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో ఎసెంట్ కళాశాల పలు ర్యాంకులు కైవసం చేసుకుంది. ఈ కళాశాల విద్యార్థి డి.హరీష్‌కుమార్ జాతీయ స్థాయిలో రిజర్వ్‌డ్ కేటగిరిలో 223వ ర్యాంక్, ఓపెన్ కేటగిరిలో 1256వ ర్యాంకు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆల్ ఇండియా స్థాయిలో కళాశాల విద్యార్థులు అన్ని కేటగిరిలో 223, 323, 530, 633, 831, 843, 999, 1256, 1456, 2072 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. 22 మంది విద్యార్థులకు 5 వేల లోపు ర్యాంక్‌లు వచ్చినట్టు పేర్కొన్నారు. 203 మంది తమ విద్యార్థులు ఈ ఏడాది ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, కళాశాల అధ్యా పకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు డైరెక్టర్ అభినందనలు తెలిపారు.

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 25: విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న భద్రతా నిర్మాణ పనులతో విశాఖ-మచిలీపట్నం మధ్య రాకపోకలు సాగించే 17219, 17220 నంబర్లు గల రైలు ఈనెల 29 నుంచి మే 27 వరకు రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయం గుర్తించాలని సూచించారు.



అడుగంటుతున్న భూగర్భ జలాలు

... 1వ పేజీ తరువాయి

10.37 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అయితే రానున్న వారం, పది రోజుల్లో వర్షాలు పడకపోతే భూగర్భ జల మట్టాలు మరింతగా పడిపోతాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి

- శ్రీనివాసరావు, డీడీ, భూగర్భ జల శాఖ

నగరం, పరిసర ప్రాంతాల్లో జనాభా పెరగడంతో భూగర్భ జలాల వినియోగం పెరిగింది. రోజువారీ అవసరాలకు జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీటికి అదనంగా నగరవాసులు బోర్లపై ఆధారపడుతున్నారు. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగింది. దీంతో కొన్నిచోట్ల బాగా అడుగం టిపోయాయి. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఇలు/ అపార్టుమెంటు ఆవరణలో ఇంకుడుగుంతలు ఏర్పాటుచేయాలి. నీటి రీసైక్లింగ్ విధానం అమలుచేయాలి. నగర పరిసరాల్లో కొండలు చుట్టూ కందకాలు తవ్వాలి. వాగులు, గెడ్డలకు చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. డబ్బు మాదిరిగానే నీటి వినియోగంలో అంతే పొదుపు, జాగ్రత్తలు పాటించాలి.

నామినేషన్ల హోరు

... 1వ పేజీ తరువాయి

(భారతీయ నిర్మాణ సేవా పార్టీ), సూరాడ యల్లాజీ (సమాజ్‌వాదీ పార్టీ), వై.సురేష్‌కుమార్ (జైభారత్ నేషనల్ పార్టీ), ఇండిపెండెంట్లుగా వంశీకృష్ణ, సౌమ్యబాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గానికి జైభారత్ నేషనల్ పార్టీ నుంచి వీవీ లక్ష్మీనారాయణ, జైభీమ్ భారత్ పార్టీ నుంచి కారెం మమత, కాంగ్రెస్ నుంచి ఎల్.రామారావు, బీఎస్పీ నుంచి పేడాడ కనకమహాలక్ష్మి, బీజేపీ తరపున విష్ణుకుమార్‌రాజు, సమాజ్‌వాదీ నుంచి శరత్‌బాబు, స్వతంత్రులుగా బి.సత్యశ్రీనివాస్, సి.మల్లికార్జునరావు, కె. ఈశ్వరభద్రాచారి, రామునాయుడు, సాహితీ నామినేషన్లు దాఖలు చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి జాతీయ జనసేన పార్టీ నుంచి మందపాటి శ్రీనివాసరాజు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బొట్టా కోటేశ్వరరావు, ఇండిపెండెంట్లుగా లక్కిడాపు సురేష్‌బాబు, కొయిలాడ వెంకటలక్ష్మి, కొయిలాడ వెంకటవరజగదీస్, వింజుమూరి కిరణ్‌కుమార్, పెదిరెడ్ల నానాజీలు, నామినేషన్లు దాఖలు చేశారు. గాజువాకకు తెలుగుదేశం పార్టీ నుంచి పల్లా శ్రీనివాసరావు, పల్లా కార్తీక్ యాదవ్, దళిత బహుజన పార్టీ నుంచి శామ్యూల్ జాన్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి తలపుల శైలజ, వైసీపీ నుంచి గుడివాడ అమర్‌నాథ్, జై మహాభారత్ పార్టీ నుంచి కాండ్రేగుల ఆదినారాయణ, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి బత్తుల నీలకంఠం, నవతరం పార్టీ నుంచి సుంకర సారజ్యోతి, ఇండిపెండెంట్లుగా కోవిరి కృష్ణ, కాకర్లమూడి కృష్ణప్రసాద్ నామినేషన్‌లు దాఖలు చేశారు. పెందుర్తికి 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీమణి అన్నంరెడ్డి శిరీష, నవరంగ కాంగ్రెస్ పార్టీ నుంచి రమేశ్‌నాయుడు, ఇండిపెండెంట్లుగా బంటికోరు గోవిందరాజు (స్వతంత్ర), పి.రమేశ్‌నాయుడు (నవరంగ్ కాంగ్రెస్), గుంటూరు నరసింహమూర్తి, షేక్ సఫీ ఉల్లా నామినేషన్లు వేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సీతంపేట, ఏప్రిల్ 25: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువకుడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్ శివాలయంవీధిలో మచ్చ శ్రీను, వనజాదేవి దంపతుల కుమారుడు వెంకటేష్ (19) ఉరేసుకున్న స్థితి లో మృతి చెందాడు. తండ్రి శ్రీను ఆటో డ్రైవర్‌గా, తల్లి వనజాదేవి ఇంట్లో పనిచేస్తుంటారు. వెంకటేష్ ఓ సినిమా థియేటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అంతా పనికి వెళ్లారు. థియేటర్‌లో మధ్యాహ్నం పని ముగించుకుని వెంకటేష్ ఇంటికి వచ్చేశాడు. రాత్రి తండ్రి శ్రీను వచ్చి చూసేసరికి ఇంట్లోని బాత్‌రూం పక్కనున్న సీలింగ్ హుక్కుకు ఉరివేసుకుని కుమారుడు వేలాడుతుండడం గమనించాడు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. వెంకటేష్ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురికి తరలించారు.

వైసీపీకి గోవింద్ రాజీనామా

కంచరపాలెం ఏప్రిల్ 25 : 55వ వార్డు ధర్మానగర్ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు జుంజూరు గోవింద్ వైసీపీకి రాజీనామా చేశారు. గోవింద్ వైసీపీ పార్లమెంట్ సెక్రటరీగా పనిచేశారు. ఇటీవల వైసీపీలో కొంత మంది సభ్యుల పోకడలను భరించలేక ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు తదితరులు

కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు

వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 25: రాష్ట్రంలోనే కాకుండా గాజువాక నియోజకవర్గంలోనూ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ ర్యాలీకి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారంటూ వారిందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు వైసీపీ ఏం చేసిందని, ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో గాజువాకలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్ ఎంపీగా విజయం సాధిస్తే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంతో పాటు గాజువాకలోని ప్రధానమైన కాలుష్య సమస్య నివారణ, మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మాణం, గాజువాకలో ఫ్లైఓవర్‌లు నిర్మిస్తామని, ఏపీఐఐసీ, గంగవరం పోర్టు, ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలంతా చీదరించుకునేలా రాష్ట్రంలో వైసీపీ పాలన ఉందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గుడ్డు మంత్రిగా పేరొందిన అమర్‌నాథ్ ఈ ప్రాంతానికి చేసేందేమీ లేదని, కనీసం ఇక్కడ ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. ఉక్కు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఇప్పుడేం ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసీపీ బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాల వారు సిద్ధంగా ఉన్నారని పల్లా పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గంధం వెంకటరావు, బొండా జగన్, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, దీనంకొండ కృష్ణంరాజు, ఎండీ.రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, ఏప్రిల్ 25: పురుషోత్తపురం 33/11 కేవీ, సత్తివానిపాలెం 33/11 ఫీడర్ల పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈ డీవీ రమణమూర్తి తెలిపారు. ఈ కారణంగా కృష్ణరాయపురం, టీచర్స్ కాలనీ, ఎస్.ఎ.డి. లేఅవుట్, పురుషోత్తపురం, శానాతివానిపాలెం, వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్‌తో పాటు నరవ పరిధిలోని సత్తివానిపాలెం, అహ్మద్‌నగర్, తులసి గార్డెన్స్, సీతారామ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.



85వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గణబాబు

వైసీపీకి చరమగీతం పాడాలి

సూపర్ సిక్స్ పథకాలతో ఎంతో మేలు

టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు

మల్కాపురం, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేస్తూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి చరమగీతం పాడేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయవలసిందిగా పెందుర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పి.గణబాబు కోరారు. ఇక్కడి హిమాచల్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ఎక్కువ రోజుల సమయం లేదని, అందువల్ల ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్నివిధాలుగా బాగుపడుతుందన్నారు. అనంతరం పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయకర్త విశ్వనాథుల దినకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనతో గణబాబు కేక్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌నాయుడు, పొట్టిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

గోపాలపట్నం: తెలుగుదేశం పార్టీ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెంలోని ఖారవేలనగర్‌లో గురువారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు దూరదృష్టితో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన పోయి అభివృద్ధి పాలన రావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ సర్కారు రద్దు చేసిన ప్రజా సంక్షేమ పథకాలన్నీ అమలు జరిగేలా చంద్రబాబు చర్యలు చేపడతారన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు చిరకాల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజలకు చేకూరే మేలు గురించి గణబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దినకర్‌కు కేక్ తినిపిస్తున్న గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 25: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హయాంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పాలన అందుతుందని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. గురువారం రాత్రి పురుషోత్తపురం, చినముషిడివాడ సత్యానగర్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, సీఎం జగన్ కల్లబొల్లి కబుర్లు చెబుతూ ప్రజలందరినీ మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇకపై జగన్ ఆటలు సాగవన్నారు. ప్యాలెస్‌లో కూర్చుని బటన్ నొక్కి తాయిలాలు ఇచ్చేస్తే ఓట్లు రాలుతాయనుకోవడం అవివేకమన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పి కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. పెందుర్తిలోని సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, ఎమ్మెల్యేగా గెలిచాక వాటిని పరిష్కరిస్తామన్నారు. టీడీపీ నేత సేనాపతి శంకరరావు, మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సేనాపతి వసంత, బల్ల శ్రీనివాసరావు, నాయకులు పిళ్లా జగన్మోహన పాత్రుడు, అయిత సింహాచలం, శ్రీను యాదవ్, పిల్లల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 94వ వార్డు పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం బుధవారం రాత్రి నాయుడుతోట లక్ష్మీ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, అధికారంలోకి రాగానే పంచగ్రామాలు, తాడి తరలింపు, వుడా భూముల సమస్యలను పరిష్కరించకపోతే తన పేరును మార్చుకుంటానన్నారు. కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి వేళ ఫోన్ చేసినా మాట్లాడతానన్నారు. తాను లోకల్ కాదని కొందరు ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు మేలు చేయాలనే తపన, సమస్యల పరిష్కారం కోసం పోరాడే తత్వం తనకు ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన 'జబర్దస్త్' ఫేమ్, సినీ నటుడు హైపర్ ఆది మాట్లాడుతూ ఓటును ఎవరూ అమ్ముకోరాదని, తానొక్కడిని ఓటెయ్యకపోతే ఏమవుతుందని భావించరాదన్నారు. ఒక్క ఓటుతో ఐదేళ్ల పాటు సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే అపూర్వ అవకాశాన్ని కోల్పోతారన్నారు. టీడీపీ నాయకుడు బొబ్బర నరసింహం ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు శేశెట్టి అప్పారావు, మామిడి కిరణ్, బొబ్బర నరసింహం, గొంతిన నాగరాజు, పిన్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



94వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల

'గాజువాక'లో మొత్తం 32 నామినేషన్లు

గాజువాక, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గాజువాక నియోజకవర్గంలో మొత్తం 32 నామినేషన్‌లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి పల్లా శ్రీనివాసరావు (నాలుగు సెట్లు), వైసీపీ నుంచి గుడివాడ అమర్‌నాథ్ (నాలుగు సెట్లు), సీపీఎం నుంచి మరడాన జగ్గునాయుడు (మూడు సెట్లు), జాతీయ జనసేన పార్టీకి చెందిన పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పి.సత్యనారాయణమూర్తి, జనవాహిని పార్టీ తరఫున చోడవరపు శంకర్, ప్రజాశాంతి పార్టీ నుంచి కేఏ పాల్, బీఎస్పీ అభ్యర్థిగా ఎన్.అప్పారావు, సీపీఎం నుంచి ఎం.రాంబాబు, లోకతంత్రిక్ జనతాదళ్ నుంచి టి.అక్కయ్య (రెండు సెట్లు) నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే దళిత బహుజన పార్టీ నుంచి శామ్యూల్ జాన్ ధర్మారాజు రాయపాటి, టీడీపీ నుంచి పల్లా కార్తీక్ యాదవ్, ప్రజాప్రస్థానం తరఫున తలపుల శైలజ, జైమహా భారత్ పార్టీ నుంచి కాండ్రేగుల ఆదినారాయణ, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి బత్తుల నీలకంఠం, నవతరం పార్టీ నుంచి సుంకర సారజ్యోతి, స్వతంత్ర అభ్యర్థులుగా గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి (రెండు సెట్లు), కాండ్రేగుల ఆదినారాయణ, సిమకుర్తి శ్రీనివాసరావు, గవర రోహిణి, కొవిరి కృష్ణ, కాకర్లమూడి కృష్ణప్రదీప్ నామినేషన్లు సమర్పించారు.

'పెందుర్తి'లో 33 నామినేషన్లు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 33 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వీకరణకు చివరి రోజైన గురువారం వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీమణి అన్నంరెడ్డి శిరీష, వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తరఫున పైలా శ్రీనివాసరావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి రమేశ్‌నాయుడు, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా నామినేషన్లు దాఖలు చేశారు. ఈఆర్వో శేషశైలజ తెలిపిన వివరాల ప్రకారం నామినేషన్లు వేసిన వారి వివరాలిలా ఉన్నాయి. అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ) మూడు సెట్లు, పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన) నాలుగు సెట్లు, పిరిడి భగత్ (కాంగ్రెస్) నాలుగు సెట్లు, పంచకర్ల వెంకటేశ్వరరావు (జనసేన), పంచకర్ల మహాలక్ష్మి (జనసేన) రెండు సెట్లు, అన్నంరెడ్డి శిరీష (వైసీపీ), పి.రమేశ్‌నాయుడు (నవరంగ్ కాంగ్రెస్), బంగారి రమణ (బీఎస్పీ) రెండు సెట్లు, ఈత రోజా (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) రెండు సెట్లు, బోలెం వెంకట మురళీమోహన్ (సమాజ్‌వాద్ పార్టీ), ఏలూరు వెంకటరమణ (నేషనలిస్ట్ జన జాగృతి), కన్నేపల్లి మహదేవ్ (జైభారత్ నేషనల్ పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా గుంటూరు వెంకట నరసింహరావు రెండు సెట్లు, వడ్డాది ఉదయ్‌కుమార్, షేక్ షఫీవుల్లా, బంటికోరు గోవిందరాజు, గుంటూరు సాయిప్రియ, కూండ్రపు సన్యాసిరావు, ఆడారి నాగరాజు రెండు సెట్లు, పోన్నాడ అప్పలనాయుడు నామినేషన్లు అందజేశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పిస్తామన్నారు.



91, 92 వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



59వ వార్డులో ఆనంద్‌కుమార్‌కు హారతిచ్చి ఆశీర్వదిస్తున్న మహిళ

వైసీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

తమ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం, ఏప్రిల్ 25: జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయవలసిందిగా ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన స్థానిక కుమారి కల్యాణ మండపంలో 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో గడిచిన ఏడాదిన్నర కాలంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం జగన్ అన్ని విధాల సహాయ సహకారాలను అందజేశారని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే 'పశ్చిమ'ను ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. పార్టీ విజయానికి వార్డు కమిటీ, బూత్ కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బెహరా భాస్కరరావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం కుమారి కల్యాణ మండపం నుంచి జరిగే భారీ బైక్ ర్యాలీని సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు ఓటమి భయం

మల్కాపురం: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గతంలో చేసిన మోసాల వల్ల ఇప్పుడు ఆ పార్టీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించి సీఎం జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైసీపీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయనతో పాటు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ 59వ వార్డులో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని కీలక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. హిమాచల్‌నగర్, లక్ష్మీనగర్, గణపతినగర్, ములగాడ హౌసింగ్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుర్రె పూర్ణశ్రీ, పీవీ సురేశ్, నాయకులు పీలా ఉమారాణి, పేడడ రమణకుమారి, పుర్రె సురేశ్, రేవల సత్యనారాయణ, అంగ రామ్‌ప్రసాద్, పిళ్లా కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)

● **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)

● **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

● **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 14, క్యాబేజీ 24, కాలీఫ్లవర్ 30, క్యారెట్ 32, దొండకాయలు 28, బంగాళదుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 150, బరబటి 34, నిమ్మకాయలు (కిలో) 90, ముల్లంగి 42, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, ఆగాకర 72, పొటల్స్ 44, కీరదోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 34, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్రరపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 113
ఫారం ధర	-- 133
విత్ స్కిన్	-- 236
స్కిన్‌లెస్	-- 246

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6లో..

గంగవరం పోర్టు కార్మికులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలి

ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు

పెదగంట్యాడ, ఏప్రిల్ 25: గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన వ్యక్తిగత నోటీసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. విశాఖ పోర్టుతో సమానంగా గంగవరం పోర్టు కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరుతూ పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు గురువారం నాటికి 16వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసిత కార్మికులకు మినహా మిగిలిన వారందరికీ వ్యక్తిగత నోటీసులు జారీ చేసిందని, మరికొందరికి ట్రాన్స్‌ఫర్‌లు చేసిందని.. ఇలా కార్మికులను యాజమాన్యం బెదిరిస్తుండడం భావ్యం కాదన్నారు. ఇలాంటి బెదిరింపులకు కార్మికులు లొంగే పరిస్థితి లేదన్నారు. కార్మికుల సమస్యలపై ఎన్నిమార్లు వినతపత్రాలు ఇచ్చినా వాటిని తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించడం లేదన్నారు. 16 రోజులుగా కార్మికులు ఆందోళనలు చేస్తుంటే యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, నాయకులు జి.అమ్మోరు, సత్యానందం, స్వామి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నోటీసులను వెనక్కి తీసుకోవాలని ఆందోళన చేస్తున్న కార్మికులు

29న పెంటమాంబ ఉత్సవం

పెదగంట్యాడ, ఏప్రిల్ 25: మండలంలోని 14 గ్రామ పంచాయతీ ప్రజల ఆరాధ్య దైవం పెంటమాంబ ఉత్సవాన్ని ఈ నెల 29న ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావులు పేర్కొన్నారు. ఆలయం ఆవరణలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 29వ తేదీ వేకువజాము ఒంటిగంట నుంచి పెంటమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని, నాలుగు గంటల నుంచి భక్తులు దర్శించుకుంటారన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు దేవీ హోమం, పూర్ణాహుతి, దీక్ష విరమణ కార్యక్రమాలను చేపడతామన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి జరిగే అమ్మవారి ఊరేగింపులో జానపద నృత్యాలు, బండ్ల వేషాలు, సాముగారిడీలు, పులి వేషాలు, కోయ డ్యాన్స్, బిందెల డ్యాన్స్, గరగ నృత్యం, వంటి సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రికి పౌరాణిక, సాంఘిక నాటకాలు, తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్లుగా బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన యెల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, గంట్యాడ పైడిరాజులను తీసుకున్నామన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పులి రామిరెడ్డి, పి.రాజా, పిట్టబాబు, పెంటారావు, డి.రామిరెడ్డి, ఎం.శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి సత్కారం

పెందుర్తి-రూరల్, ఏప్రిల్ 25: పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీకి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఇన్‌చార్జి గండి బాబ్జీ నాయకత్వం అవసరమని ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు పిల్లల అప్పలనాయుడు పేర్కొన్నారు. పినగాడి కూడలిలో పలువురు టీడీపీ నాయకులు గురువారం బాబ్జీని కలిసి పెందుర్తి ఇన్‌చార్జిగా నియమితులవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను సత్కరించారు. బాబ్జీ నాయకత్వంలో పెందుర్తిలో టీడీపీ మరింత బలోపేతం అవుతుందన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

అగనంపూడి, ఏప్రిల్ 25: మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాంకీ ఫౌండేషన్ డీజీఎం గిరిధర్ భక్తి అన్నారు. విశాఖ ఫార్మాసిటీ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రాంకీ ఫౌండేషన్ సహకారంతో శ్రేయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గిరిధర్ భక్తి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల్లో కూడా నైపుణ్యాలు ఉంటాయని, వాటిని మెరుగుపరుచుకుని కుటుంబాలు ఆసరాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, ఉష, శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రీనివాస్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌షిప్ వాసులపై విద్యుత్ చార్జీల పెంపు తగదు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 25: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వారికి విద్యుత్ చార్జీలు పెంచుతూ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ ఉక్కు గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉక్కు పరిపాలన భవనం ముందు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టౌన్‌షిప్ వాసులపై యాజమాన్యం అనేక భారాలు మోపిందన్నారు. పెరిగిన జీతాలు చెల్లించకపోవడం, సకాలంలో జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఇలాంటి భారాలు మోపటం భావ్యం కాదన్నారు.

కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితి బాగోలేదని, ఈ క్రమంలో సంస్థ ప్రగతి కోసం ఆలోచించాల్సిన యాజమాన్యం అలా చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేసేందుకు సిద్ధపడడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాను, పి.శ్రీనివాసరాజు, అప్పారావు. కృష్ణమూర్తి, రాజు, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా డొంకాడ దుర్గమాంబ జాతర

అగనంపూడి, ఏప్రిల్ 25: జీవీఎంసీ 85వ వార్డు పరిధి డొంకాడ, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే అమ్మవారి దర్శనాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించాక తిరిగి ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, అట్టా అప్పారావు, పెంటారావు, డి.సన్యాసిరావు, విశ్వనాథ్, కరణం శ్రీను, సత్తిబాబు, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

మలేరియాపై అవగాహన ర్యాలీ

మల్కాపురం, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాపురంలో గురువారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ మాట్లాడుతూ మలేరియా కారకానికి దోహదపడే దోమలు నీటిలో ఎక్కువగా వృద్ధి చెందుతాయని, అందువల్ల ఎక్కడా నీటి నిల్వలు లేకుండా ప్రజలు చుసుకోవాలన్నారు. అందరూ మలేరియా సిబ్బంది చేసిన సూచనలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల నగర్‌లో..

కూర్మన్నపాలెం: దోమల పట్ల అప్రమత్తంగా ఉంటే జ్వరాలు ప్రబలవని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావు అన్నారు. 87వ వార్డు తిరుమలనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. శానిటరీ అధికారి అప్పారావు, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సంధ్య, నీలిమ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 25: ఢిల్లీ నుంచి వస్తున్న నేతలు రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై మాట్లాడకుండా ప్రజలను నిస్సిగ్గుగా ఓట్లు అడుగుతుండడం విడ్డూరంగా ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షా శిబిరంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రధాన సమస్యలను పట్టించుకోని కేంద్రంలోని బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


46వ వార్డులో ప్రచారం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు


ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న శ్యామల దీపిక

వైసీపీకి ఓటు వేస్తే.. పిల్లలకు భవిష్యత్తు ఉండదు

» ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు » 46వ వార్డు పరిధిలో విస్తృత ప్రచారం » 45వ వార్డులో తండ్రి తరపున కుమార్తె ప్రచారం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: వైసీపీకి ఓట్లువేస్తే మీ పిల్లల భవిష్యత్తుకు ఉరితాడు వేసినట్లేనని ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పి.విష్ణు కుమార్ రాజు హెచ్చరించారు. గ్రేటర్ 46వ వార్డులో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనారాయణపురం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఓ ఫాస్టఫుడ్ సెంటర్ వద్దకు వెళ్లి కళాయిలో చిప్స్ వేయించి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేస్తే మన మనుగడ మరింత ప్రమాదంలోపడుందని అన్నారు. ఇటువంటి దుర్మార్గంగా పాలన గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారన్నారు. ఈ స్థితిలో ఆపార్టీకి ఓటు వేసి గెలిపిస్తే భవిష్యత్తు ఉండదని, ఈ స్థితిలో ఈ అరాచక పాలనకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సంక్షేమ పాలన అందించడానికి వీలవుతుందన్నారు. ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గుర్తు కమలంపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏపీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనుందో వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్నికల పరిశీలకుడు మహ్మద్ నజీర్, టీడీపీ, బీజేపీల వార్డు అధ్యక్షులు పుక్కళ్ళ పైడికొండ, గార ఈశ్వరరావు, నాయకులు ఆవాల నారాయణస్వామి, యాగాటి ఆదిలక్ష్మి, తోట శ్రీదేవి, కొప్పిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

45వ వార్డులో బీజేపీ ఇంటింటి ప్రచారం

ఉత్తర నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు గెలిపించేందుకు కమలం గుర్తుపై ఓటు వేయాలని ఆయన కుమార్తె శ్యామల దీపిక అభ్యర్థించారు. ఈ మేరకు గ్రేటర్ 45వ వార్డు ఏఎస్‌ఆర్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి గురువారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఆమె మహిళలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఓచోట ఇస్త్రీ చేసి ఆమె ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


డెంకాడవీధిలో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్


ప్రేమసమాజం ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న పద్మజ

బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం

» ఎన్నికల ప్రచారంలో దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ » నీరాజనం పలికిన జనం

మహారాణిపేట, ఏప్రిల్ 25: బలహీన వర్గాల అభివృద్ధే తన ధ్యేయమని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం 37వ వార్డు రెల్లివీధి అంబేద్కర్ విగ్రహం నుంచి ఆయన తన ప్రచారం ప్రారంభించారు. డెంకాడవీధి, పెయిందొరపేట, జాలారిపేటపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు విన్నారు. నిరుపేదల సంక్షేమమే తన సంకల్పమని భరోసా ఇచ్చారు. ఇళ్ల మంజూరు చేస్తానని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. మీ ఆశీర్వాదం కావాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏవీఎన్ కాలేజీ డౌన్ సున్నపువీధిలోని బాబన ముత్యాలమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. అన్నదానం అన్నింటిలోకి ఉత్తమమైందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. అనంతరం భక్తులకు స్వయంగా ఆయన భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయతో అందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామకమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సేవల్లోనే సంతృప్తి.. వంశీకృష్ణ సతీమణి పద్మజ

డాబాగార్డెన్స్: ప్రేమ సమాజంలో అనాథ బాలికలు, వృద్ధులకు, మహిళలకు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ సతీమణి పద్మజ అన్నారు. గురువారం ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్నం వడ్డించారు. ఆశ్రమం పొందుతున్నవారి పరిస్థితి చూసి ఆమె చలించిపోయారు. ప్రేమ సమాజంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ముత్యమాంబ


శాకంబరి అమ్మవారు

కంచరపాలెం, ఏప్రిల్ 25 : కంచరపాలెం మెట్టు వద్ద కొలువై ఉన్న ముత్యమాంబ మారువారం పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. మారు పండగ నేపథ్యంలో అమ్మవారిని తాజా కూరగాయలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులుచెల్లించుకున్నారు. సాయంత్రం ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నీలి మేఘం..గాలి కెరటం

» ఆకాశం మేఘావృతంతో ఉపశమనం


మాధవధారా ప్రాంతంలో సాయంత్రం మేఘావృతమైన ఆకాశం

మురళీనగర్, ఏప్రిల్ 25 : గత కొద్ది రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న నగర వాసులకు ఊరట లభించింది. రెండురోజులుగా సాయంత్రం 3 గంటలు దాటిన తర్వాత వాతావరణం మేఘావృతం కావడంతో ఎండ ప్రభావం తగ్గుతోంది. చల్ని గాలులతో జనాలు సేదతీరుతున్నారు. వాతావరణ శాఖ గత రెండు రోజులుగా ఎండలతోపాటు వడగాలులు వీస్తాయన్న హెచ్చరికలతో ఆందోళన చెందిన జనానికి గురువారం సాయంత్రం ఊరట నిచ్చింది. ఆకాశం మబ్బులేసి చల్లని గాలులు వీయడంతో నగర వాసులకు ఉపశమనం లభించినట్టయింది.

వీవీ లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు


ఆర్వోకి నామినేషన్ పత్రాలు అందిస్తున్న లక్ష్మీనారాయణ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ గురువారం నామినేషన్ వేశారు. అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి సీతమ్మధార కార్యాలయంలో అధికారులకు నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం బయటకు వచ్చి మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ హైకోర్టు స్టేటస్ కో ఇచ్చిందని, 2024 జూన్‌లో కోర్టు తిరిగి తెరచేవరకు స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించడం లేదని అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపినట్టు ఈ సందర్భంగా చెప్పారు. యథాతథ స్థితిని పాటించాలని యూనియన్ ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశిస్తూ హైకోర్టు జూన్ 19వ తేదీకి వాయిదా వేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా పలు ఆధారాలతో ఇప్పటికే హైకోర్టులో లక్ష్మీనారాయణ పిల్ వేసిన సంగతి తెలిసిందే. హైకోర్టు స్టేటస్ కో లక్ష్మీనారాయణ రాజకీయ తొలి విజయంగా అభిమానులు భావిస్తున్నారు. ఆయన వేసిన పిల్‌పై న్యాయవాది యలమంచిలి బాలాజీ వాదించారు.

వాల్తేరు రైల్వే నూతన సీనియర్ డీసీఎంగా సందీప్


డీసీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందీప్

విశాఖపట్నం, ఏప్రిల్ 25: తూర్పుకోస్తారైల్వే వాల్తేరు డివిజన్ నూతన సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా (సీనియర్ డీసీఎం) కె సందీప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ సివిల్ సర్వీసెస్ 2013 బ్యాచ్‌కు చెందిన సందీప్.. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ (ఐఆర్‌టీఎస్) అధికారిగా కుర్దా డివిజన్‌లో అసిస్టెంట్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించి వాల్తేరు డివిజన్‌లో ఏరియా మేనేజర్‌గా, సంబల్‌పూర్ డివిజన్‌లో డీసీఎంగా, సీనియర్ డీవోఎం (ముమెంట్)గా పనిచేశారు. కుర్దా డివిజన్‌లో సీనియర్ డీసీఎంగా పనిచేస్తూ వాల్తేరు డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సీనియర్ డీసీఎంగా పనిచేసిన ఏకే త్రిపాఠి సంబల్‌పూర్ డివిజన్‌కు సీనియర్ డీసీఎంగా బదిలీ అయ్యారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25 : ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్కరాజు రామారావు గురువారం నామినేషన్ వేశారు. మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌లతో ర్యాలీగా బయలుదేరి తాటిచెట్లపాలెం, గురుద్వార మీదుగా సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందన్నారు.

అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

» ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సతీమణి తేజస్విని


33వ వార్డులో ప్రచారం చేస్తున్న తేజస్విని

అల్లిపురం, ఏప్రిల్ 25: అభివృద్ధికి అవకాశం కల్పించే అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ సతీమణి తేజస్విని అన్నారు. గురువారం సాయంత్రం 33వ వార్డులో ప్రచారం చేశారు. ముందుగా సీతమ్మఅమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వార్డులో ఇంటింటికి వెళ్లి ఓటర్లను పలకరిస్తూ రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించి వైసీపీ పాలనతో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని నిలువరించాలని కోరారు. ఎంపీగా శ్రీభరత్‌ను, అసెంబ్లీ అభ్యర్థి వంశీ కృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొట్టి వసంత లక్ష్మి, వంశీ కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, తిరుమలరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఫిట్జీ విద్యార్థులకు ర్యాంకులు


విద్యార్థులతో అధ్యాపక బృందం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఫిట్జీ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ కళాశాల విద్యార్థులు వరుసగా ఏఐఆర్ 3, 13, 23, 35, 42, 48, 50లను సాధించారు. ఫిట్జీ వైజాగ్ విద్యార్థులు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీరామ వెంకటకృష్ణ 1149వ ర్యాంక్, ఎల్. సాయి వెంకట కార్తీక్ 1203వ ర్యాంక్, హంసిని 1609వ ర్యాంక్, డి. అంకిత అరవింద్ 4010, కృష్ణార్క్ 4621వ ర్యాంక్, ఎస్.సాయిసాత్విక్ 4788వ ర్యాంక్‌ను పొందారు.మొత్తం 680 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రాయగా 263 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. ఈ సందర్భంగా మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్‌రావు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

శ్రీవిశ్వ జూనియర్ విద్యార్థులు విజయకేతనం


ఫలితాలను సాధించిన శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ -2024 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్టు చైర్మన్ కె.దర్భరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విశాఖపట్నం విద్యా సంస్థ శ్రీవిశ్వ విద్యార్థులు పవ్న గౌతమ్ 468వ ర్యాంకు, పి. ఓంకార్ సాయిరాయుడు 522వ ర్యాంకు, జగన్నాథ్ బ్రాహ్మ 620వ ర్యాంకు, పి.వెంకటసాయిరామ్‌చద్ర 645వ ర్యాంకు, పొట్నూరు ఆదిత్య 674వ ర్యాంకు కె.ఆయవర్ధన 725, జె.హ్లాదశ్రీ 768, కర్రి మహేష్ 943 సాధించినట్టు వివరించారు. సాధారణ విద్యార్థులతో తమ కళాశాల అసాధారణ ఫలితాలను సాధించిందన్నారు. వెయ్యిలోపు 8 మంది, 5 వేల లోపు ర్యాంకులు 30 మందికి, పది వేలలోపు 52 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. దాదాపు 16 మంది విద్యార్థులు 99 పర్సంటైల్‌పైగా సాధించారన్నారు. 216 మందికిపైగా విద్యార్థులు ఎన్ఐటీ, ఐఐటీలలోసీటు పొందేలా ర్యాంకులు సాధించడం విశేషమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని వారు అభినందించారు.

ఏయూ అచీవర్స్ డే రద్దు

... 1వ పేజీ తరువాయి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పందించారు. తనకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత విషయం ఎందుకు చెప్పలేదని ఏయూ అధికారులను ప్రశ్నించారు.సాధారణ సమావేశం అని పెద్దగా వివరించకుండా అనుమతి ఇచ్చామని, తప్పుడు సమాచారం ఇచ్చినందున అనుమతి రద్దు చేయాలని సంబంధిత ప్రాంతవు ఎన్నికల అధికారిని ఆదేశించారు. దాంతో శుక్రవారం నిర్వహించాల్సిన అచీవర్స్ డే రద్దయింది.

మెయిన్స్‌లో మెరుపులు

... 1వ పేజీ తరువాయి

సాధించారు. కాగా నగరంలోని కార్పొరేట్ కళాశాలలైన శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, ఆసెంట్, శ్రీవిశ్వ తదితర సంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. 500లోపు 100 మంది, 1000లోపు 200 మంది ర్యాంకులు తెచ్చుకున్నట్టు కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఉంది



-చింటు సతీష్‌కుమార్, 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ)

నగరంలోని నారాయణ కళాశాలలో చదువుతున్న చింటు సతీష్‌కుమార్ మెయిన్స్‌లో 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ) సాధించారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతీష్‌కుమార్ తల్లిదండ్రులు రమాదేవి, బుచ్చన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సహకారంతో ఈ ర్యాంకు సాధించగలిగానంటున్న సతీష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో సీఎస్‌ఈలో చేరాలనుకుంటున్నట్టు చెప్పారు. తదుపరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలనుకుంటున్నట్టు తెలిపారు.

పేదోడి పొట్టకొట్టిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

ఆహారాన్ని అందించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం 2018 జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. అన్న క్యాంటీన్లకు ఆహారాన్ని సరఫరా చేసే బాధ్యతను అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించింది. అన్న క్యాంటీన్‌లో ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు ఐదు రూపాయలకే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పూట కూడా నాణ్యమైన భోజనాన్ని రూ.5కే పెట్టేవారు. అనతికాలంలోనే అన్న క్యాంటీన్లకు విశేషమైన ఆదరణ రావడంతో దశల వారీగా జీవీఎంసీ పరిధిలో విస్తరింపచేశారు. ఎంవీపీ రైతుబజార్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, టర్నర్ చౌల్ట్రీ, హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్, మద్దిపాలెం, శ్రీహరిపురం, ములగాడ వంపాకాలనీ, చినగంట్యాడ, దిబ్బపాలెం, రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, పెందుర్తి, వేపగుంట, గోపాలపట్నం రైతుబజార్, కేజీహెచ్ ఓపీ గేట్, ఆరిలోవ, మారికవలస, వాంబే కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, తదితర 25 చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేశారు. వీటిన్నింటికీ పక్కా భవనాలు కట్టించి భోజనం చేసేవారికి సౌకర్యాలు ఉండేందుకు కుర్చీలు, టేబుళ్లు వంటి సదుపాయాలు కల్పించారు. భవన నిర్మాణ కూలీలు, రిక్షావాలాలు, ఆటోడ్రైవర్లు, నిరుపేదలు, ఉద్యోగ శిక్షణ కోసం నగరానికి ఉండే పేద విద్యార్థులు క్యాంటీన్లతో ఆకలి తీర్చుకునేవారు. నగర పరిధిలో ప్రతిరోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది మధ్యాహ్నం భోజనం, పది వేల మంది రాత్రి భోజనం చేసేవారు. సాధారణ హోటళ్లలో పెట్టే భోజనం కంటే ఎంతో నాణ్యమైన ఆహారం సమకూరడంతో ఖర్చులు తగ్గి ఆర్థికంగా కొంత వెసులుబాటు కలిగేది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను మూసివేయించింది. అన్నక్యాంటీన్ల పేరు మార్చాలని మొదట్లో వైసీపీ నేతలు భావించినా, వాటిపై టీడీపీ ముద్ర తొలగిపోదనే ఉద్దేశంతో శాశ్వతంగా మూసివేయించారని విమర్శలు వెల్లువెత్తాయి. అన్న క్యాంటీన్లకు ప్రత్యామ్నాయంగా అంతకంటే మెరుగ్గా ఉండేలా 'ఆహా' క్యాంటీన్లను ఏర్పాటుచేస్తామని వైసీపీ నేతలు ప్రకటించినా, ఏడేళ్లయినా కార్యరూపం దాల్చలేదు. అయితే తమకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తమ కడుపు కొట్టిందని వైసీపీ ప్రభుత్వాన్ని నిరుపేదలు ఇప్పటికీ దూషిస్తూనే ఉన్నారు.

సమయానికి నాణ్యమైన ఆహారం తినేవాళ్లం

-కందివలస కృష్ణ, అక్కయ్యపాలెం

అన్న క్యాంటీన్ మా ఇంటికి దగ్గర్లోని సోనియానగర్ వద్ద ఉండేది. మూడు పూటలా నాణ్యమైన ఆహారాన్ని అందుబాటులో ఉండేవారు. రూ.5 ధరకే అల్పాహారం తిని పనికి వెళ్లేవాళ్లం, రాత్రికి రూ.5కే మళ్లీ అక్కడే భోజనం తిని ఇంటికి వెళ్లిపోయేవాడిని. మా ఇంట్లో ఉన్నవారు కూడా అన్న క్యాంటీన్లోనే భోజనం చేసేవారు. ఆరోగ్యం కూడా బాగుండేది. అన్న క్యాంటీన్లను మూసివేయడంతో ఆర్థికంగా జీవనంసాగిస్తున్నాం. ఉదయం టిఫిన్ చేయాలంటేనే రూ.50 వెచ్చించాల్సివస్తోంది. మళ్లీ అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తేవాలి.

రాజకీయాల కోసం పేదల కడుపు కొట్టారు

- వై.చిట్టిబాబు, రామకృష్ణానగర్

రాజకీయాల కోసం అన్న క్యాంటీన్లను మూసి వేయించి మాలాంటి పేదల కడుపు కొట్టారు. టీడీపీ హయాంలో ఏర్పాటుచేశారని అక్కసుతోనే వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసివేయించేశారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసిన తర్వాత నామమాత్రపు ధరతో మూడు పూటలా నాణ్యమైన ఆహారం తినగలిగాం. దీనివల్ల ఆర్థికంగా కూడా మాకు భారం తగ్గింది. అన్న క్యాంటీన్లు రద్దు చేయడంతో వచ్చిన కూలీ డబ్బుల్లో సగం డబ్బుని ఆహారానికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సీతంపేట, ఏప్రిల్ 25: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువకుడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్ శివాలయంవీధిలో మచ్చ శ్రీను, వనజాదేవి దంపతుల కుమారుడు వెంకటేష్ (19) ఉరేసుకున్న స్థితిలో మృతి చెందాడు. తండ్రి శ్రీను ఆటో డ్రైవర్‌గా, తల్లి వనజాదేవి ఇంట్లో పనిచేస్తున్నారు. వెంకటేష్ ఓ సినిమా థియేటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అంతా పనికి వెళ్లారు. థియేటర్‌లో మధ్యాహ్నం పని ముగించుకుని వెంకటేష్ ఇంటికి వచ్చేశాడు. రాత్రి తండ్రి శ్రీను పని చూసేసరికి ఇంట్లోని బాత్‌రూం పక్కనున్న సీలింగ్ హుక్కు ఉరేసుకుని వేలాడుతుండటం గమనించారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేష్ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

వైసీపీకి గోవింద్ రాజీనామా

కంచరపాలెం ఏప్రిల్ 25 : 55వ వార్డు దర్శానగర్ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు జుంజూరు గోవింద్ వైసీపీకి రాజీనామా చేశారు. గోవింద్ వైసీపీ పార్లమెంట్ సెక్రటరీగా పనిచేశారు. జీవీఎల వైసీపీలో కొంత మంది నాయకుల పోకడలను భరించలేక ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

ఎసెంట్ కళాశాల విద్యార్థికి 223వ ర్యాంకు


జేఈఈలో ర్యాంక్ సాధించిన హరీష్‌కుమార్

సీతంపేట, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో ఎసెంట్ కళాశాల పలు ర్యాంకులను కైవసం చేసుకుంది. ఈ కళాశాల విద్యార్థి డి.హరీష్‌కుమార్ జాతీయ స్థాయిలో రిజర్వ్‌డ్ కేటగిరిలో 223వ ర్యాంక్, ఓపెన్ కేటగిరిలో 1256వ ర్యాంకు సాధించినట్టు కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. ఆల్ ఇండియా స్థాయిలో కళాశాల విద్యార్థులు అన్ని కేటగిరిలో 223, 323, 590, 633, 831, 843, 999, 1256, 1456, 2072 ర్యాంకులు సాధించినట్టు వివరించారు. 22 మంది విద్యార్థులకు 5 వేల లోపు ర్యాంకులు వచ్చినట్టు పేర్కొన్నారు. 203 మంది తమ విద్యార్థులు ఈ ఏడాది ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు డైరెక్టర్ అభినందనలు తెలిపారు.

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు

విశాఖపట్నం, ఏప్రిల్ 25: విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ప్రధాన నిర్మాణ పనుల దృష్ట్యా విశాఖ-మచిలీపట్నం మధ్య రాకపోకలు సాగించే 17219, 17220 నంబర్ల గల రైలు ఈనెల 29 నుంచి మే 27 వరకు రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. ప్రయాణికులు ఈ విషయం గుర్తించాలని సూచించారు.



అడుగంటుతున్న భూగర్భ జలాలు

... 1వ పేజీ తరువాయి

10.37 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అయితే రానున్న వారం, పది రోజుల్లో వర్షాలు పడకపోతే భూగర్భ జల మట్టాలు మరింతగా పడిపోతాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు.

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- శ్రీనివాసరావు, డీడీ, భూగర్భ జల శాఖ

నగరం, పరిసర ప్రాంతాల్లో జనాభా పెరగడంతో భూగర్భ జలాల వినియోగం పెరిగింది. రోజువారీ అవసరాలకు జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీటికి అదనంగా నగరవాసులు బోర్లపై ఆధారపడుతున్నారు. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగింది. దీంతో కొన్నిచోట్ల బోర్లు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఇలు/ అపార్టుమెంట్ ఆవరణలో ఇంకుడుగుంతలు ఏర్పాటుచేయాలి. నీటి రీసైక్లింగ్ విధానం అమలుచేయాలి. నగర పరిసరాల్లో కొండలు చుట్టూ కందకాలు తవ్వాలి. వాగులు, గెడ్డలకు చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. డబ్బు మాదిరిగానే నీటి వినియోగంలో అంతే పొదుపు, జాగ్రత్తలు పాటించాలి.

నామినేషన్ల హోరు

... 1వ పేజీ తరువాయి

(భారతీయ నిర్మాణ సేవ పార్టీ), సూరాద యల్లాజీ (సమాజ్‌వాది పార్టీ), మైసురేష్‌కుమార్ (జైభారత్ నేషనల్ పార్టీ), ఇండిపెండెంట్లుగా వంశీకృష్ణ, సోమ్మలబాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గానికి జైభారత్ నేషనల్ పార్టీ నుంచి వీవీ లక్ష్మీనారాయణ, జైభీమ్ భారత్ పార్టీ నుంచి కోరం మమత, కాంగ్రెస్ నుంచి ఎల్.రామారావు, బీఎస్పీ నుంచి పేడాడ కనకమహాలక్ష్మి, బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు, సమాజ్‌వాది నుంచి శరత్‌బాబు, స్వతంత్రులుగా బి.సత్యశ్రీనివాస్, సి.మల్లికార్జునరావు, కె. ఈశ్వరచంద్రాచారి, రామునాయుడు, వన్నెపాత్ర సాయినివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి జాతీయ జనసేన పార్టీ నుంచి మండపాటి శ్రీనివాసరాజు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బొట్టా కోటేశ్వరరావు, ఇండిపెండెంట్లుగా లక్కిరెడ్డి సురేష్‌బాబు, కొయిలాడ వెంకటలక్ష్మి, కోయిలాడ వెంకటవరజగదీస్, విజ్జుమూరి కిరణ్‌కుమార్, పెదిరెడ్ల నానాజీలు, నామినేషన్లను దాఖలు చేశారు. గాజువాకకు తెలుగుదేశం పార్టీ నుంచి పల్లా శ్రీనివాసరావు, పల్లా కార్తీక్ యాదవ్, దళిత బహుజన పార్టీ నుంచి శామ్యూల్ జాన్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి తలపల రైల్లు, వైసీపీ నుంచి గుడివాడ అమర్‌నాథ్, జై మహాభారత్ పార్టీ నుంచి కాండ్రేగుల ఆదినారాయణ, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి బత్తుల సీలకంఠం, నవతరం పార్టీ నుంచి సుందర సాంబశివరావు, ఇండిపెండెంట్లుగా కొవిరి కృష్ణ, కర్రి మాడి కృష్ణప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు. పెందుర్తికి 22 మంది నామినేషన్లను దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీమణి అన్నంరెడ్డి శిరీష, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి రమేష్‌నాయుడు, ఇండిపెండెంట్లుగా బంటికిరి గోవిందరావు (స్వతంత్ర), పి.రమేష్‌నాయుడు (నవరంగ్ కాంగ్రెస్), గుంటూరు నరసింహమూర్తి, షేక్ సబీ ఉల్లా నామినేషన్లు వేశారు.



సమర్థులకే ఓటు

ఇదీ తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువత మనోగతం

ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చే నాయకుడు కావాలి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకులనే ఎన్నుకుంటాం
- ఉచిత పంపిణీలకు పరిమితమై అభివృద్ధిని పక్కనపెట్టడం సరికాదని వాదన
- కుటుంబ సభ్యులో, బంధువులో చెప్పారని తమ నిర్ణయం మార్చుకోబోమని స్పష్టీకరణ





విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

"పాలకులు ఎవరైనా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా ఉండాలి. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి బాట పట్టించాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందించాలి. ఇవన్నీ చేయగల సమర్థత ఉన్న నాయకులను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజల జీవితాల్లోనూ మార్పు సాధ్యమవుతుంది. నా ఓటు అటువంటి సమర్థుడైన నాయకుడికే" అంటున్నాడు తొలిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న నగరానికి చెందిన పట్టభద్రుడు అచ్యుత్‌వర్మ. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంతోమంది యువ ఓటర్లు ఇదే విధమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా వ్యవహరించే నాయకుడిని ఎన్నుకుంటే మేలు జరుగుతుందన్న భావన యువ ఓటర్లలో ఉంది. ఉచిత పథకాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజలు కష్టపడి సంపాదించుకునే మార్గాలను చూపించాలని, వృత్తి, ఉపాధి కల్పన మార్గాలపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. ఇప్పటికీ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని, దీనిపై పాలకులు ఎందుకు దృష్టిసారించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక, దానికి అనుగుణమైన కార్యాచరణ ముఖ్యమని, ఆ దిశగా పాలకులు ముందుచూపుతో వ్యవహరించాలని యువ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న యువతీ, యువకుల మనోగతాన్ని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' యత్నించింది. వారి అభిప్రాయాలు...

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి



నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్లేలా పాలకుల ఆలోచన ఉండాలి. అప్పుడే మెరుగైన సమాజాన్ని స్థాపించేందుకు అవకాశం ఉంటుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను మేనిఫెస్టోలో పెట్టాలి. యువతకు మేలు చేసే వారిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. వైద్యం కూడా ఉచితంగా అందించాలి. నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించే పాలకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకుంటాను.

- ఎం.దేవి, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని

అవినీతి రహిత పాలన అందించేవారికే ఓటు



అవినీతి రహిత పాలన అందించే పాలకులను ఎన్నుకోవాలి. ఇప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇస్తేనేగానీ పనులు జరగడం లేదు. ఇటువంటి వ్యవస్థల్లో మార్పు తీసుకురావాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు కృషిచేయడం లేదు. అవినీతికి ఆస్కారం లేని ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఆటువంటి మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు తొలి ఓటును వినియోగించుకుంటాను. బంధువులు చెప్పారనో, కుటుంబ సభ్యులు ఒత్తిడి చేశారనో బలవంతంగా ఎవరికీ ఓటు వేయకూడదు. నా మనసుకు నచ్చిన వ్యక్తికి ఓటేసి గెలిపిస్తాను.

- ఎం.జోగి శివరామ్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి

ప్రజలకు అందుబాటులో ఉండేవారినే ఎన్నుకోవాలి



స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలి. అప్పుడే అందరికీ మేలు జరుగుతుంది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తరువాత ఎంతోమంది ప్రజలకు అందుబాటులో ఉండరు. వారి సమస్యలను పట్టించుకోరు. ఆటువంటి నేతలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి. ప్రభుత్వాలు కూడా ప్రజలకు ఉపాధి పొందే మార్గాలను చూపించాలి. సంపాదన అవకాశాలను చూపించాలి. అప్పుడే రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుంది. మేనిఫెస్టోల్లో అనేక అంశాలను పేర్కొని..వాటిని అమలు చేయడానికి ఇబ్బందులు పడడం మంచిది కాదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల స్థితిగతులను మెరుగుపర్చే కీలక అంశాలపై దృష్టిసారించేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉండాలి. అప్పుడే ప్రజలు స్వీయాభివృద్ధి సాధించడంతోపాటు రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది.

- కె.మనీషా, డిగ్రీ మూడో ఏడాది విద్యార్థి

ఉచితాలకు కాదు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి



నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. పీజీ ప్రైవేటు కళాశాలల్లో చేయడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వడం లేదు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే ప్రభుత్వానికి ఓటేస్తాను. నిరుపేద విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఉచితాలకు కాకుండా అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్ర ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని పథకాలను అమలు చేయాలి. అప్పులు చేసి పథకాలు అమలుచేసే విధానానికి పాలకులు దూరంగా ఉండాలి. ఆటువంటి నేతకు మాత్రమే ఓటు వేస్తాను. - పి.దుర్గ శివమ్, డిగ్రీ సెకండియర్ విద్యార్థి

ఉద్యోగావకాశాలు కల్పించగలిగిన వారికే...



ఎన్నికలలో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత చదువుకున్న యువతను నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులకు ముందుచూపు లేకపోవడం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయి. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం అయినా పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. త్వరలో జరగబోయే ఎన్నికలలో నా మొదటి ఓటు ఆలోచించి వేస్తాను. - ద్రాక్షారపు గౌతమ్, డిగ్రీ విద్యార్థి, బలిఘట్టం

అప్పులు చేసి పంపకాలు చేయడం సరికాదు



ఏ ప్రభుత్వం వచ్చినా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలి. అభివృద్ధితో పాటు ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వాలు ప్రాధాన్యం కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమలు ఎక్కువ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అప్పుడే రాష్ట్ర అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వాలు ఉచితాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇబ్బంది కలుగుతోంది. ఇటువంటి వాటికి చెక్ చెప్పాలి. ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఆలోచించాలి. అప్పులు చేసి పంపకాలు చేయడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిపోతుంది. పట్టణాలు, నగరాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. - ఎం.చంద్రలోకేష్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి

ఉపాధి కల్పించే వారికే ఓటు



దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రభుత్వాలు వస్తున్నాయి..పోతున్నాయి. కానీ, నిరుద్యోగుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. చదివిన చదువులకు ఉద్యోగాలు దొరకనప్పుడు..ఈ విద్యా వ్యవస్థ, ప్రభుత్వాలు ఎందుకు. పాలకులకు ముందుచూపు లేకపోవడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు ఎవరైనా ఉద్యోగాలు కల్పించేలా ఉండాలి. కొత్త పరిశ్రమలను తీసుకురావాలి. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలి. అటువంటి ఆలోచన చేసే ప్రభుత్వాలకే ఓటు వేస్తాం. ఇప్పటికే ఆ దిశగా నిర్ణయం తీసుకున్నాం. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రతి ఒక్కరిదీ ఇదే మాట.

- కె.విష్ణుప్రియ, డిగ్రీ మూడో ఏడాది విద్యార్థి

గిరిజన హక్కులకు రక్షణ కల్పించే వారికే...



గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చే నేతలకే ఓటు వేయాలని భావిస్తున్నాను. నాకు తొలిసారిగా ఓటు హక్కును వినియోగించే అవకాశం వచ్చింది. దానిని సక్రమంగా వినియోగించుకోవాలనే ఆలోచనతో ఉన్నాను. ప్రధానంగా గిరిజన ప్రాంత అభివృద్ధి, సంక్షేమంతోపాటు గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ కల్పించే నేతకే ఓటు వేస్తాను. యువత, విద్యా వంతులు సైతం కాస్త ఆలోచించి గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే వారికే ఓటు వేస్తే బాగుటుందని అభిప్రాయపడుతున్నాను.

- సంతారి గోపాలరాజు, లోచలిపుట్టు గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి జిల్లా



తాయిలాలకు లొంగకూడదు



తాత్కాలిక తాయిలాల కంటే శాశ్వత అభివృద్ధి పథకాలు అమలు చేయగలిగిన సత్తా ఉన్న అభ్యర్థులను ఎన్నుకుంటేనే సమాజానికి మేలు. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వారికి ఓటు వేయాలి. కార్మిక, కర్షకుల ప్రగతికి సమ ప్రాధాన్యం ఇచ్చే నేతలు అవసరం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు వెనుకబడితే ఆర్థిక వ్యవస్థలు పతనమవుతాయి.

- తారకరామ్, వ్యవసాయదారుడు, నర్సీపట్నం

ఉపాధికి భరోసా ఇవ్వాలి



నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలను, నేతలను ఎన్నుకోవాలి. మోసపూరిత మాటలు, ఉచితం పేరుతో తాయిలాలు మేలు చేయవు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చే వారు కావాలి. చట్టసభల్లో సమస్యలు ప్రస్తావించి, పరిష్కరించే సామర్థ్యం ఉన్న వారికి ఓటు వేయాలి. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటామన్న పార్టీని గెలిపించుకోవడం మంచిది.

- అంగనైని ఆనంద్, విద్యార్థి, అరకు

లౌకికతత్వం అవసరం



ప్రజాస్వామ్యం పటిష్టంగా కొనసాగాలంటే లౌకిక తత్వ రాజకీయ పార్టీలనే గెలిపించుకోవాలి. కులమతాలు, వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టే పార్టీలతో ప్రమాదం. అన్ని మతాలు, వర్గాలను సమానంగా చూసే పార్టీలతో మేలు జరగక పోయినా కీడు జరగదు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పదాలు రాజకీయ నేతలు వల్లించడానికి బాగుంటున్నాయి. వాటికి కట్టుబడిన వ్యక్తులు, పార్టీలు తక్కువ. అలాంటి వ్యక్తులను చట్టసభలకు పంపితే అభివృద్ధికి అవకాశం.

- కేఎన్ మల్లీశ్వరి, నవలా రచయిత్రి, విశాఖ

నిజాయితీ కలిగి ఉండాలి



చట్టసభలకు పోటీచేసే అభ్యర్థుల్లో నిజాయితీ కలిగిన వారిని ఎన్నుకోవాలి. పరిశ్రమల స్థాపనకు కృషి చేసే నేతలకు ఓటు వేస్తే నిరుద్యోగ సమస్య తీరుతుంది. మాయమాటలతో కాలక్షేపం చేసేవారిని తిరస్కరించాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి పాలన అందుతుంది. లేదంటే మోసపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతారు.

-గుడివాడ శ్రీనివాసరావు, లెక్చరర్, గాజువాక

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

గాజువాకలో విలక్షణ తీర్పు!

ఏ పార్టీకీ రెండోసారి లభించని ఆదరణ

- ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు





చింతలపూడి వెంకటరామయ్య



పల్లా శ్రీనివాసరావు

మినీ ఇండియాగా గుర్తింపు పొందిన నియోజకవర్గం

పారిశ్రామిక వాడగా పేర్గాంచిన గాజువాక నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది.. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ నివసిస్తుండడంతో దీనికి మినీ ఇండియాగా కూడా పేరుంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేవి. డీ లిమిటేషన్‌లో భాగంగా 2008లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఆవిర్భవించింది. నియోజకవర్గ పరిధిలో 302 పోలింగ్ కేంద్రాలుండగా 3,23,,671 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,57,787 మంది, 1,55,009, ఇతరులు 13 మంది ఉన్నారు.

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు నిలయం కావడంతో పారిశ్రామికవాడగా గుర్తింపు పొందింది. విశాఖ ఉక్కు కర్మాగారంతో పాటు, దువ్వాడలో ప్రత్యేక ఆర్థికమండలి, గంగవరం పోర్టు, బీహెచ్‌ఈఎల్ వంటి సుమారు మూడువేల మధ్య, చిన్న తరహా పరిశ్రమలు నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. ఈ పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి కోట్లాది ఆదాయం వస్తున్నందున ఆర్థిక రాజధానిగా పేర్గాంచింది. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వచ్చిన ఎంతో మంది ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గాజువాక నియోజకవర్గాన్ని మినీ ఇండియాగా పిలుస్తారు.

నియోజకవర్గ పరిధిలో విభిన్న ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడిన ఓటర్లే అధిక శాతం మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లో వీరి ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇప్పటి వర కు మూడు పర్యాయాలు ఎన్నికలు జరగ్గా వేర్వేరు పార్టీలకు చెందిన నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన చింతలపూడి వెంకట్రామయ్య సమీప స్వతంత్ర అభ్య ర్థి, ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిపై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో తిప్పల గురుమూర్తిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా, చందాడ నరసింగరావు సీపీఐఎం అభ్యర్థిగా బరిలో నిలిచా రు. 2014లో జరిగిన ఎన్నికల్లో గాజువాకలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పల్లా శ్రీనివాస్ సమీప వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై గెలిచారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది కాగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ల మధ్య పోటీ జరగనుంది.



తిప్పల నాగిరెడ్డి

● గాజువాక

గాజువాకలో విజేతల వివరాలు

సంవత్సరం	విజేత	సమీప ప్రత్యర్థి	ఓట్ల తేడా
2009	సీహెచ్ వెంకట్రామయ్య	నాగిరెడ్డి	17,907
2014	పల్లాశ్రీనివాసరావు	నాగిరెడ్డి	21,712
2019	తిప్పల నాగిరెడ్డి	పవన్‌కల్యాణ్	16,753

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	3,23,671
పురుషులు	1,62,434
మహిళలు	1,61,225
ఇతరులు	12

ఓటర్లలో టాప్!

- రాష్ట్రంలోనే ప్రథమం
- జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోనే లక్ష మంది ఓటర్లు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమ్మిళితం
- పుణ్య క్షేత్రాలు, సందర్శనీయ స్థలాలకు ఆలవాలం
- భీమిలి నియోజకవర్గం ప్రత్యేకం



భీమునిపట్నం నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 3,60,507 మంది ఓటర్లున్నారు. విస్తీర్ణంలోనూ పెద్దదిగా గుర్తింపు పొందింది. భీమిలి అర్బన్, మండలంతో పాటు ఆనందపురం, పద్మనాభం మండలాలు, మధురవాడతో దీనికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రముఖ సందర్శనీయ స్థలాలు, విద్యా సంస్థలు, పుణ్యక్షేత్రాలు, స్టార్ హోటళ్లు, రిసార్టులు, విశ్వవిద్యాలయాలు, బోధనాస్పత్రులకు ఆలవాలంగా నిలిచింది.

నియోజకవర్గం పరిధిలోని పద్మనాభం మండలం చిన్నాపురం, భీమిలి మండలం బోడమెట్టపాలెం, ఆనందపురం మండలం గండిగుండం వరకూ, అడవివరం, గోపాలపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో వున్న ఎల్లపువానిపాలెం గ్రామం కూడా ఈ నియోజకవర్గంలోనే వుండడం విశేషం. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వెనుకబాగం, బీచ్‌రోడ్‌లో సాగర్‌నగర్, ఎండాడ, మదురవాడ, పీఎం పాలెం ఏరియాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. ఇంకా సింహాచలం పుణ్యక్షేత్రం, అనంతపద్మనాభస్వామి, గుడిలోవ రంగనాథస్వామి, భీమిలి శ్రీలక్ష్మీనృసింహస్వామి, రుషికొండ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయలతో తదితర పుణ్యక్షేత్రాలున్నాయి. గీతం డీమ్డ్ యూనివర్సిటీ, గాయత్రి, సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రులతో పాటు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం, ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు, గంభీరం ఐఐఎం దీని పరిధిలోనివే. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, సహజసిద్ధ ప్రకృతి సౌందర్యం భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, తొట్లకొండ, బావికొండ, పావురాయి కొండ ప్రాచీన బౌద్ధక్షేత్రాలు, అల్లూరి సీతారామరాజు జన్మస్థలం పాండ్రంగి, అశోకుని విజయస్థూపం ప్రతిష్ఠించిన పొట్నూరు, ఐటీ సెజ్, స్టార్ హోటళ్లు, రిసార్టులు, మంగమారిపేట వారిజ ఆశ్రమం, బ్యాంక్ కోలనీ శ్రీ కె.శివానందమూర్తి ఆశ్రమం, సద్గురు ఉమర్ ఆలీషా ఆశ్రమం, సౌరిస్ ఆశ్రమం నియోజకవర్గ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాయి.

భీమిలి నియోజకవర్గం డేటా

మొత్తం ఓటర్లు:	3,60,507
పురుషులు :	1,76,860
స్త్రీలు :	1,83,632
ఇతరులు :	15
6,772 మంది మహిళా ఓటర్లు అధికం	
85 సంవత్సరాలు దాటిన వారు :	1,808
దివ్యాంగ ఓటర్లు :	3,769
మొత్తం పోలింగ్ స్టేషన్లు :	348
వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లు:	220
క్రిటికల్ పోలింగ్ స్టేషన్ ఏరియాలు:	86
మండలాలవారీగా ఓటర్ల వివరాలు	
పద్మనాభం :	42,033
ఆనందపురం:	51,224
భీమిలి :	1,01,892
విశాఖ రూరల్:	1,65,358

భీమిలి పరిధి జీవీఎంసీ 5,6,7 వార్డుల్లోనే సుమారు లక్షకు పైగా ఓటర్లున్నారు. అభ్యర్థుల విజయావకాశాలను నిర్దేశించేది వీరే. ఈ వార్డుల్లో ఉద్యోగులు, అక్షరాస్యులు ఎక్కువ. మిథిలాపురి వుడాకాలనీ, రత్నగిరి హౌసింగ్‌బోర్డు కాలనీ, రెవెన్యూకాలనీ, సంపత్‌నగర్, పోర్టుకాలనీ, హెచ్‌పీసీఎల్ లేఅవుట్, సాయిప్రియాగార్డెన్స్, అశోక్‌నగర్, తులసీనగర్ తదితర కాలనీల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీటితో పాటు స్వతంత్రనగర్ కాలనీ, బింద్రానగర్, ఆర్‌హెచ్‌కాలనీ, సేవానగర్, కె.వన్ కాలనీ, కె.2 కాలనీ, మారికివలస, దివ్యాంగుల కాలనీ ప్రాంతాల్లో రోజువారీ కూలీల సంఖ్య అధికం.

● భీమునిపట్నం/మధురవాడ